క్లుప్తంగా

ఘనంగా పస్కా పండుగ



బీరప్ప ఆలయం వద్ద భక్తులు

పుల్‌కల్(అందోల్): గొల్లకురుముల ఆధ్వర్యంలో పస్కా పండుగ ఘనంగా నిర్వహించారు. ముదిమాణిక్యం గ్రామ శివారులో ఉన్న బీరప్ప దేవాలయంలో నైవేద్యం సమర్పించారు. భజన కార్యక్రమాలు, ఒగ్గు కళాకారులు బుర్రకథను వినిపించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ పడమటి రమేశ్, కుర్మ సంఘం నాయకులు బేతాలు, మొగులయ్య, నర్సింహులు, నాగయ్య పాల్గొన్నారు.

చెరువు పరిశీలన



చెరువు వద్ద ఇరిగేషన్ అధికారులు

మునిపల్లి(అందోల్): ఇరిగేషన్ ఈఈ మధుసూదన్‌రెడ్డి, అధికారులు బుగ్గరామన్న చెరువును ఆదివారం పరిశీలించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని పెద్దగోపులారం– గొర్రెగట్టు గ్రామ శివారులో ఉన్న చెరువును పరిశీలించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో డీఈ రాజశేఖర్, ఏఈ అఖీల, మానిక్‌రావు పాల్గొన్నారు.

జగద్గురును దర్శించుకున్న ఎంపీ సురేశ్ షెట్కార్



జగద్గురు బీమాశంకర్ సన్నిధిలో ఎంపీ సురేశ్ షెట్కార్, కుటుంబ సభ్యులు

నారాయణఖేడ్: గురు పౌర్ణమిని పురస్కరించుకొని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, ఆయన కుటుంబ సభ్యులు ఆదివారం మహారాష్ట్ర నాందేడ్‌లో నిర్వహించిన గురు పూజోత్సవంలో పాల్గొన్నారు. షెట్కార్ ఆయన సతీమణి ఉమాదేవి, సోదరుడు జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యుడు నగేశ్ షెట్కార్, ఆయన సతీమణి మాలాదేవి షెట్కార్, కేంద్ర మాజీ మంత్రి శివరాజ్ పాటిల్, కర్ణాటకలోని దవనగిరి ఎంపీ ప్రభామల్లికార్జున్ తదితరులతో కలిసి ఆయన కేదార్నాథ్ జగద్గురు భీమశంకర్ శివాచార్యను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించారు.

విరాళం అందజేత



విరాళాన్ని అందిస్తున్న భక్తులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి అన్ని వర్గాల ప్రజల నుంచి విరాళాలు అందుతున్నాయి. హైదరాబాద్‌కు చెందిన శివభక్తులు రాకేశ్ గోయల్, దినేశ్ గోయల్ ఆదివారం తమ వంతుగా రూ.3 లక్షలను విరాళంగా అందించారు. దేవాలయ నిర్మాణ నిర్వాహకులు, గ్రామస్తులు భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ సమన్వయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో రేణుక ఎల్లమ్మ



అలంకరణలో అమ్మవారు

పటాన్‌చెరు టౌన్: ప్రత్యేక అలంకరణలో రేణుక ఎల్లమ్మ భక్తులకు దర్శనమిచ్చింది. ఆషాఢ మాసం మూడో ఆదివారం కావడంతో అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకోవడానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చారు. బోనాలు ఎత్తుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు రాగా ఆలయ పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి. ఉదయం 6 గంటలకు అర్చకులు అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేక అలంకరణ గావించారు.

ఘనంగా గురుపౌర్ణమి

సాయిబాబా తమను చల్లంగా చూడాలని భక్తులు వేడుకున్నారు. జిల్లా వ్యాప్తంగా గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాబా ఆలయాలతోపాటు పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయితే పంచామృతాలు, అభిషేకాలు చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అర్చకులు అలంకరణ చేశారు. నైవేద్యాలు సమర్పించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలి రావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఫలస్వాదిలో నిర్వహించిన శోభాయాత్ర కనుల పండువగా సాగింది. భక్తిశ్రద్ధలతో భజన గీతాలు ఆలపిస్తూ, మహిళలు కోలాటాలతో మంజీరా నది వద్దకు వెళ్లారు. అక్కడ చాతుర్మాస్య పూజలు నిర్వహించారు. - నెట్‌వర్క్



సంగారెడ్డిటౌన్: మంజీరా నదిలో పూజలు నిర్వహిస్తున్న మహేశ్వర శర్మ తదితరులు



నారాయణఖేడ్: సాయిబాబా ఆలయంలో సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు



జిన్నారం: బొల్లారంలో హోమం చేస్తున్న భక్తులు



హత్నూర(సంగారెడ్డి): దత్తాత్రేయ స్వామికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి



సంగారెడ్డిటౌన్: విశేష అలంకరణలో సాయిబాబా



జోగిపేట(అందోల్)లో..

క్షీరాభిషేకం



వెంకటాపూర్‌లో క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

నారాయణఖేడ్: రైతు రుణమాఫీ సంబురాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఖేడ్ మండలం వెంకటాపూర్ పంచాయతీ కార్యాలయం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, ఉప సీఎం భట్టి, మంత్రులు నాగేశ్వర్‌రావు, రాజనర్సింహ, ఎంపీ సురేశ్ షెట్కార్ , ఎమ్మెల్యే సంజీవరెడ్డి చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాహెర్ అలీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

భక్తి శ్రద్ధలతో నగర సంకీర్తన

జహీరాబాద్ టౌన్: నగర సంకీర్తన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హరేకృష్ణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం హౌసింగ్ బోర్డు కాలనీ.. హనుమాన్ మందిరం నుంచి ప్రారంభమైన నగర సంకీర్తన పాదయాత్ర భజనలు, కీర్తనలు చేస్తూ కాలనీల గుండా తిరిగి యథాస్థానానికి చేరుకొని ముగిసింది. మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

సఖ్యత కుదిరేనా?

కాంగ్రెస్‌లో ముగ్గురు కీలక నేతలు

- మద్దతు తెలిపే విషయమై పటాన్‌చెరు కేడర్‌లో అయోమయం
- మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ తీరుపై పార్టీ శ్రేణుల గుస్సా!

జిన్నారం(పటాన్‌చెరు): కాంగ్రెస్‌పై దుమ్మెత్తి పోసిన బీఆర్‌ఎస్ నేతల్లో పలువురు ఇటీవల ఆపార్టీలో చేరారు. దీంతో సుదీర్ఘంగా పార్టీలో ఉన్న నేతలు తమ భవిష్యత్‌పై దిగులు చెందుతున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని ముఖ్యనేతలు కూడా కాంగ్రెస్‌లోనే ఉండటంతో కార్యకర్తల్లో అయోమయం నెలకొంది. మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ తీరుపై మండల నాయకుల భగ్గుమంటున్నారు.

కాంగ్రెస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా కాటా శ్రీనివాస్‌గౌడ్ ఏళ్లుగా కొనసాగుతున్నారు. ఆయన పార్టీ కేడర్‌కు అండగా ఉంటున్నారు. ఇటీవల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా మహిపాల్ కాంగ్రెస్‌లో చేరారు. ఆయన రెండు పర్యాయాలు పనిచేశారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో పటాన్‌చెరు ఎమ్మెల్యే టికెట్‌పై ఆపార్టీ నుంచి గూడెం మహిపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి కాటా శ్రీనివాస్‌గౌడ్, బీఎస్పీ నుంచి నీలం మధు పోటీ చేశారు. గూడెం గెలుపొందారు. అనంతరం నీలం మధు కాంగ్రెస్‌లో చేరి ఎంపీగా పోటీ చేసి ఓడారు. రాజకీయ పరిణామాల నేపథ్యంలో మహిపాల్‌రెడ్డి కూడా ఇటీవల సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. దీంతో నియోజకవర్గంలోని ముఖ్య నేతలు పార్టీలోనే ఉన్నారు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో గల ముఖ్య నేతల మద్దతుదారులు, పార్టీల కార్యకర్తలు అయోమయంలో పడ్డారు. ఎవరికి మద్దతు ఇవ్వాలో తెలియక వారు గందరగోళానికి గురవుతున్నారు. నియోజకవర్గంలో ఇప్పుడు మూడు గ్రూపులుగా విడిపోయిందని నాయకులు, కార్యకర్తలు వాపోతున్నారు. జిన్నారం మండలం నుంచి మాజీ జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్ కూడా హస్తం గుర్తు పార్టీలో చేరారు. ఆయన తీరుపై మండల నేతల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది.



సోలక్‌పల్లిలో జరిగిన కార్యక్రమంలో ప్రభాకర్‌పై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న నాయకులు (ఫైల్)

ఇటీవల సోలక్‌పల్లిలో జరిగిన రైతు రుణమాఫీలో వేదికపై కూర్చోవటాన్ని పార్టీ శ్రేణులు వ్యతిరేకించారు. ఈ మండలం నుంచి ప్రభాకర్ తప్ప ఆయన అనుచరులు చేరలేదు. ప్రస్తుతం గ్రామాల్లో కాంగ్రెస్ నుంచి కాటా శ్రీనివాస్‌గౌడ్, నీలం మధుకు మద్దతుదారులు ఉన్నారు. మహిపాల్‌రెడ్డికి కాటా, నీలం వర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఎలాంటి సహకారం అందిస్తారో చూడాలి. అభివృద్ధే లక్ష్యంగా ప్రతిఒక్కరినీ కలుపుకొని ముందుకు సాగుతామని ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే పేర్కొన్నారు. మూడు వర్గాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు ఇటీవల పార్టీలో చేరిన నేతల మధ్య రానున్న రోజుల్లో సఖ్యత ఎలా ఉంటుందో చూడాలి.

ఈ గుంతలను పూడ్చరూ..



కంది చౌరస్తాలో ఏర్పడిన గుంతలు

కంది చౌరస్తా గుంతలమయంగా మారింది. పై నుంచి వచ్చే మురుగును మళ్లించేందుకు తాత్కాలికంగా పైపులు వేశారు. కొద్ది రోజుల క్రితం పైపులు దిగిపోయి పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డుపై వెళ్తున్న వాహనాలు గుంతల్లో పడి వాహనదారులు కింద పడుతున్నారు. శంకరపల్లి వైపు వెళ్లే దారిలో భారీ గుంత ఏర్పడింది. ఈ దారి గుండా పెద్దఎత్తున వాహన రాకపోకలు సాగిస్తుంటాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

– కంది(సంగారెడ్డి)

పెద్దచెరువుకు గండి



గండిని పూడ్చి వేస్తున్న నాయకులు

కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో ఊట్ల గ్రామంలో గల పెద్ద చెరువు తూముకు గండి పడింది. మత్స్య సహకార సంగం జిల్లా డైరెక్టర్ మహేశ్ ఆధ్వర్యంలో మత్స్యకారులు గండి పూడ్చేశారు. జిల్లా అధికారులు స్పందించి, తూముకు శాశ్వత పరిష్కారం చేయాలని మహేశ్ డిమాండ్ చేశారు.

– జిన్నారం(పటాన్‌చెరు)

ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు సన్మానం

జహీరాబాద్: ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను కాంగ్రెస్ నాయకులు సత్కరించారు. ఆదివారం కర్ణాటకలోని గుల్బర్గా వెళుతూ బల్మూరి వెంకట్ జహీరాబాద్‌లో కొద్ది సేపు ఆగారు. ఈ సందర్భంగా గడిలోని ఊరడమ్మ దేవాలయాన్ని దర్శించుకుని బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ నేత శ్రీకాంత్‌రెడ్డి ఇంట్లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, నాగిరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, అత్తార్‌గౌరి పాల్గొన్నారు.



బల్మూరి వెంకట్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నేడు ప్రజావాణి

పుల్‌కల్(అందోల్): తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ ఆనంద్ మేరీ తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై వినతి పత్రాలను అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

ఖర్గేకు జన్మదిన శుభాకాంక్షలు



పటాన్‌చెరు: ఖర్గేకు నమస్కరిస్తున్న మధు

పటాన్‌చెరు: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నేత నీలంమధు ముదిరాజ్ శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం బెంగళూరులోని ఆయన నివాసంలో మాజీ సీఎం వీరేంద్ర పాటిల్ కుమారుడు కైలాష్షత్ పాటిల్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ నారాయణ్‌రావు, పీసీసీ ప్రధానకార్యదర్శి రాజ్‌గోపాల్ రెడ్డిలతో ఆయన వెళ్లారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ పార్లమెంట్‌లో పేద ప్రజల పక్షాన ఖర్గే గొంతుక వినిపిస్తున్నారన్నారు. మతతత్వ రాజకీయాలను దీటుగా ఎదుర్కొంటూ పార్టీని సమర్థవంతంగా నడిపిస్తున్నారని కొనియాడారు.

పటాన్‌చెరు టౌన్: ఖర్గే జన్మదిన వేడుకలను పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకొని సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడారు. ఇండియా కూటమికి 230 స్థానాలు రావడంలో మల్లికార్జున ఖర్గే కీలక పాత్ర పోషించారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అతీక్, పట్టణ ఉపాధ్యక్షుడు యువరాజ్ మోరే, కార్యదర్శి అబ్దుల్లా నాయకులు సాయిలు ముదిరాజ్, జోసెఫ్, హర్షిత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్: ఖర్గే జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నాగల్‌గిద్ద మండలం మోర్గి చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఎమ్మెల్యే కేక్‌ను కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాణిక్‌రావు, నాయకులు గుండేరావు పాటిల్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్, వైస్ చైర్మన్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు



కూల్చివేసిన స్థలంలో నిర్మించిన కాంప్లెక్స్

జిన్నారం మండలం మాదారంలో గల సర్వేనంబర్ 283, 284, 620, 627లోని ప్రభుత్వ భూముల్లో ఉన్న అక్రమ నిర్మాణాలను అధికారులు మార్చి నెలలో ఇలా కూల్చేశారో? లేదో?.. అక్రమార్కులు బరితెగించి మరోసారి నిర్మాణాలు చేపడుతున్నారు. ఆ మేరకు కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేసినట్లేనని తెలుస్తోంది. ఇంతా జరుగుతున్నా రెవెన్యూ అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

–జిన్నారం(పటాన్‌చెరు)

ఖాజీ చెరువులోకి కలుషిత నీరు



ఖాజీచెరువు నుంచి భారీగా బయటకు వస్తున్న కలుషిత జలాలు

పరిశ్రమలకు చెందిన వర్షపు నీరుతో కలిసి యథేచ్ఛగా కలుషిత నీరు బయటకు వస్తుంది. ఈ వరదతో ఖాజీ చెరువు నిండి పొర్లిన నీరు బయటకు వెళ్లి కుంటల్లోని జలాన్ని సైతం కలుషితం చేస్తుంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న రసాయన పరిశ్రమలపై పీసీబీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇది జిన్నారం మండలం ఖాజీపల్లి పారిశ్రామికవాడలోని పరిస్థితి.

– జిన్నారం(పటాన్‌చెరు)

బోనం.. ఘనం

మన సంస్కృతీ సంప్రదాయాలకు బోనాలు ప్రతీకగా నిలుస్తాయని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. ఆషాఢ మాసం రీత్యా బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. మహిళలు వాటిని నెత్తిపైన పెట్టుకొని ఊరేగింపుగా బయలుదేరి అమ్మవార్లకు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారులంతా దప్పు చప్పుళ్లు, వాయిద్యాలు.. శివసత్తువులు పూనకాలు, పోతరాజుల విన్యాసాలు ఆహూతులను అలరించాయి. అయితే ఆలయాల వద్దకు చేరుకున్న మహిళలు, భక్తులు.. నైవేధ్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వారికి అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. పలు గ్రామాల్లో అన్నదాన వితరణ జరిగింది. ఆలయాలకు వెళ్లే మార్గాలు రద్దీగా కనిపించాయి

- నెట్‌వర్క్



సదాశివపేటరూరల్: బోనం తీసుకెళ్తున్న నిర్మలారెడ్డి



జిన్నారం: గుమ్మడిదలలో



నారాయణఖేడ్: బోనాల ఉత్సవాల్లో భక్తుల సందడి



జోగిపేట(అందోల్)లో..



మునిపల్లి (అందోల్): మల్లికార్జునపల్లిలో..



రాయికోడ్(అందోల్): బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న మహిళలు